



సత్తుపాటి ప్రసన్నశ్రీ



చేకూరి శివరామకృష్ణ ప్రసాద్

రెండు వర్సిటీలకు వీసీల నియామకం

కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యావ్యవస్థను గాడిలో పెట్టే చర్యలకు దిగింది.. ఎట్టకేలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు మంగళవారం వీసీ (వైస్ చాన్సలర్ల) నియామకం చేపట్టింది.. కాకినాడలో ఉన్న జేఎన్‌టీయూకే వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ జిల్లా వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు.. గుంటూరు జిల్లాకు చెందినవారు. ఇక తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఉన్న నన్నయ వర్సిటీ వీసీగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం విశాఖపట్నం ఏయూలో ఆంగ్ల విభాగ ప్రొఫెసర్‌గా ఉన్నారు.. 19 గిరిజన భాషలకు లిపి రూపొందించింది 2022లో అప్పటి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారం అందుకున్నారు. వీరిద్దరూ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. - వివరాలు 6లో

ప్రజాస్వామ్యం ఖూ(తు)నీ!



ఉద్రిక్తత : తుని బాలాజీ కాంప్లెక్స్ వద్ద బారికేడ్లను తోసుకొస్తున్న కార్యకర్తలపై లాఠీఛార్జి

ఓటమి పాలైనా వైసీపీ నాయకులు మారలేదు.. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సుమారు 17 మంది కౌన్సిలర్లను బంధించి గత రెండు రోజులుగా స్వేచ్ఛను హరిస్తున్నారు.. మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చినా భేఖాతర్ చేస్తున్నారు.. ఎన్నికలు జరిగే మునిసిపల్ కార్యాలయాన్ని ఆనుకుని ఎడమ వైపున ఉన్న చైర్‌పర్సన్ నివాసంలో వైసీపీ కౌన్సిలర్లను బంధించారు. కళ్లెదుటే కౌన్సిలర్లు ఉన్నా వేలాదిగా ఉన్న పోలీసులు.. అధికారం చేతిలో ఉన్న కూటమి నాయకులు వారు ఎప్పుడొస్తారోనని ఎదురుచూడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. తునిలో కళ్లెదుటే వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు..

తునిలో వైసీపీ అరాచకీయం

- మళ్లీ వైసీపీ నేతల డ్రామాలు
- హాజరైన టీడీపీ కౌన్సిలర్లు
- వైసీపీ కౌన్సిలర్ల నిర్బంధం
- బయటకొచ్చిన కౌన్సిలర్లు
- లాక్కుపోయిన రాజా
- కోరం లేక మళ్లీ వాయిదా
- నాలుగోసారీ అంతే
- తేలని వైస్ చైర్మన్ ఎన్నిక
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- చలో తునికి వైసీపీ నేతలు
- అడ్డుకున్న పోలీసులు

కాకినాడ/ తుని రూరల్ (ఆంధ్రజ్యోతి) : మళ్లీ అదే సీను.. అదే డ్రామా.. ఎన్నికకు హాజరైతే ఓడిపోతామనే భయంతో అవే కుయుక్తులు.. కౌన్సిలర్ల నిర్బంధాలు.. అడుగు పెట్టనీయకుండా వారిపై ఆంక్షలు.. చివరకు మళ్లీ నాలుగోసారీ వాయిదా.. వైసీపీ డ్రామాలతో తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఎటూ తేలకుండా సా..గుతోంది. చివరకు మంగళవారమైనా ఉత్కంఠకు తెరపడుతుందని భావిస్తే మళ్లీ సేమ్.. వైసీపీ తీరుతో కోరం లేని కారణంగా వాయిదా.. దీంతో తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఎప్పటికి పూర్తవుతుందోనన్న ఆందోళన.. చలో తునికి అనుమతి లేకపోయినా పలువురు వైసీపీ నేతలు ఇంకో డ్రామాకు తెరలేపగా పోలీసులు అడ్డుకుని వెనక్కు పంపారు.

మళ్లీ అదే రిపీటు..

తుని మునిసిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రోజు రోజుకు ఉత్కంఠభరితంగా మారుతోంది. కోరం లేక సోమవారం ఎన్నిక రద్దవగా, తిరిగి మంగళవారం కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. వాస్తవానికి తునిలో ఖాళీ అయిన వైస్ చైర్మన్ ఎన్నికకు ఈనెల 3న నోటిఫికేషన్ జారీ అయింది. వైసీపీ డ్రామాల కారణంగా ఈనెల 3,4 తేదీల్లో జరగాల్సిన ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. తాజాగా కోర్టు ఆదేశాలతో సోమవారం ఎన్నికకు వీలుగా అధికారులు కౌన్సిలర్లను ఆహ్వానించారు. టీడీపీ నుంచి పది మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాగా వైసీపీ కౌన్సి లర్లు 17 మందిని ఆ పార్టీ నిర్బంధించి ఓటింగ్‌కు రాకుండా చేసింది. కోరం లేకపోవడంతో ఎన్నికను రద్దు చేసి మంగళవారం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.దీంతో మంగళవారం ఉదయం 11 గంటలకు టీడీపీ కౌన్సిలర్లు 10 మంది ఎన్నికకు హాజరయ్యారు. వైసీపీ కౌన్సిలర్లు వస్తారని అంతా భావించారు. కానీ వైసీపీ తన డ్రామాను మళ్లీ కొనసాగించింది. ఉదయం 8 గంటలకే తమ కౌన్సిలర్లను వైసీపీ మునిసిపల్ చైర్మన్ నివాసానికి తరలించింది. కాసేపటికే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అక్కడకు చేరుకుని ఎన్నికకు వెళ్లొద్దంటూ బెదిరించారు. మరో పక్క ఉదయం 10 గంటలు అవగానే తుని టీడీపీ కార్యకర్తలు,నాయకులు మునిసిపాలిటీ వద్దకు చేరుకున్నారు. వీరిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. కొందరు వైసీపీ కౌన్సిలర్లను దాచిపెట్టిన చోటు వైపు వెళ్లే ప్రయత్నం చేయగా పదుల సంఖ్యలో పోలీసులు మోహరించి బారికేడ్లు అడ్డంపెట్టేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. సరిగ్గా ఉదయం 10:30 గంటలకు టీడీపీ కౌన్సిలర్లు పది మంది మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వీరి ధ్రువీకరణ పత్రాలను సరిచూసి అధికారులు 11 గంటలకు లోపలకు పంపారు. కానీ వైసీపీ కౌన్సిలర్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని వైసీపీ కౌన్సిలర్లు ఉన్న ప్రాంతం వైపు చొచ్చుకు వెళ్లడానికి పరుగులు తీశారు. వైసీపీ కౌన్సిలర్లను నిర్బంధించిన దాడిశెట్టి రాజా, చైర్‌పర్సన్ ఉన్న వైపు టీడీపీ శ్రేణులు దూసుకువెళ్లే ప్రయత్నం చేశాయి. ఎన్నికకు కౌన్సిలర్లను పంపాలని వైసీపీని నిలదీసేందుకు టీడీపీ నేతలు పలుసార్లు ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ శ్రేణుల వైపు దూసుకురావడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఘర్షణ నెలకొనడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

ఇక ఈసీ నిర్ణయమే..

మళ్లీ ఎప్పుడు ఎన్నిక జరుగుతుందనేది ఈసీ నిర్ణయిస్తుందని అధికారులు వివరించారు. ఇప్పటికే ఎన్నిక నాలుగుసార్లు వాయిదా పడడంతో ఈ విషయాన్ని కలెక్టర్ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో రెండుసార్లు కోరం లేక వాయిదాపడినందున తదుపరి నిర్వహించే ఎన్నిక కోరంతో సంబంధం లేకుండా నిర్వహించొచ్చా? లేదా?అనే దానిపై ఈసీ త్వరలో నిర్ణయించే అవకాశం ఉంది.



మేము ఇక్కడే ఉన్నాం : చైర్‌పర్సన్ నివాసం నుంచి బయటకొచ్చిన వైసీపీ కౌన్సిలర్లు

ఇలా రాగానే.. అలా లాక్కుపోయారు..!

ఎన్నిక మరికాసేపట్లో ప్రారంభం కానుండగా వైసీపీ కౌన్సిలర్లు కొందరు నిర్బంధం నుంచి బయటకొచ్చి సమావేశానికి వచ్చే ప్రయత్నం చేశారు. టీడీపీ నేతలు వారి వైపు దూసుకెళ్లారు. గమనించిన దాడిశెట్టి రాజా, చైర్‌పర్సన్ వారిని తమ మనుషులతో లోపలకు లాక్కుపోయారు. సమయం 12 గంటలు దాటిపోయినా వైసీపీ కౌన్సిలర్లు రాకపోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేశారు.



మేము వచ్చేశాం : హాజరైన టీడీపీ కౌన్సిలర్లు



అనుమతి లేదన్నా వచ్చేసి : నేలపై బైఠాయించి ద్వారంపూడి, కన్నబాబు, ఇతర వైసీపీ నాయకుల నిరసన

చలో తుని.. మరో డ్రామా..

ఒక పక్క ఎన్నిక జరగకుండా అడ్డుకుంటున్న వైసీపీ.. మంగళవారం చలో తునికి రావాలంటూ దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. పోలీసులు చలో తునికి అనుమతి లేదని తెగేసి చెప్పారు. తొలుత కిర్లంపూడి నుంచి ముద్రగడ పద్మనాభరెడ్డి తునికి బయలుదేరగా తుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో పోలీసులు అడ్డుకోగా వెనుదిరిగి వెళ్లిపోయారు. అటు మాజీ ఎంపీ వంగా గీత తునిలో హల్‌చల్ చేశారు. అనుమతి లేదని చెప్పినా రాజా వద్దకు వెళ్లి కౌన్సిలర్లతో మాట్లాడారు. కాకినాడ నుంచి మాజీ మంత్రి కన్నబాబు, ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు తునికి వెళ్లే ప్రయత్నం చేయగా గొల్లప్రోలు హైవేపై పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా తుని వచ్చిన మాజీ ఎంపీ వంగా గీతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తునిలో గొడవలు జరిగే అవకాశం ఉండడంతో నియోజకవర్గంలో మాజీ మంత్రి దాడిశెట్టితోపాటు పలువురు నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

'రెవెన్యూ' లక్ష్యాలను చేరుకోవాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగులు ఏ దశలోను నిర్లక్ష్యం వహించకుండా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులపై సకాలంలో స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించి పలు అంశాలపై ఆయన సమీక్షించారు. సమస్యల పరిష్కారంలో సందేహాలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలన్నారు. ఇళ్ల స్థలాలకు గతంలో కేటాయించిన భూముల్లో ఏమైనా ఖాళీ స్థలాలు ఉన్నట్టయితే వాటన్నింటినీ మ్యాపింగ్ చేసి సమర్పించాలన్నారు. లబ్ధిదారుడు ఒకచోట పట్టా పొంది మరో చోట ఇళ్లు నిర్మించుకున్నట్టయితే అటువంటి వాటిని సరిచేయాలని ఆదేశించారు. రీ సర్వేలో భూముల విస్తీర్ణంలో ఉన్న వ్యత్యాసాలను రైతుల సమక్షంలోనే తగు పరిష్కార మార్గాలు సూచిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా లబ్ధిదారుల సంతృప్తి స్థాయిలను రాష్ట్రస్థాయినుంచి తెలుసుకుంటున్నందున ప్రతీ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆర్వోఆర్ పట్టా పుస్తకాలు జారీలోను అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. డేటా ఎంట్రీలో తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదని, రీసర్వే గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఖచ్చితంగా భూ రికార్డులను స్వచ్ఛీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, ఆర్డీవోలు డి.అఖిల, పి.శ్రీకర్, కె.మాధవి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఇక రిజిస్ట్రేషన్లు మరింత సులభతరం



మాట్లాడుతున్న నాగలింగేశ్వరరావు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డు 2.0తో రిజిస్ట్రేషన్లు మరింత సులభతరమైందని జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు పేర్కొన్నారు. కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ పూర్తి అవుతోందని వివరించారు. అమలాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం బిల్డర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల భూములను కన్వర్షన్ చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయనకు బిల్డర్లు వివరించారు. నెలల తరబడి భూముల కన్వర్షన్ పూర్తి కాకపోవడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణాలు పూర్తి అయిన ఫ్లాట్లకు రెసిడెన్సీ పన్ను భారీ మొత్తాల్లో వేయడాన్ని డీఆర్వో దృష్టికి తీసుకువచ్చారు. బిల్డర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. సమావేశంలో సబ్ రిజిస్ట్రార్లు ఆర్.శ్రీలక్ష్మి, పి.లక్ష్మణరాజు, కల్వకొలను తాతాజీ, సుంకర నాయుడు,అరిగెల బుజ్జి, చిక్కాల గణేష్, ముద్రగడ తాను, చింతపల్లి చిన్నా, రేకపల్లి సోము, ఆశెట్టి ఆదిబాబు, శిరిగినీడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ల మోసాలకు చెక్ పెడుతూ..

కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్

కలెక్టర్ మహేష్‌కుమార్



హెల్ప్‌డెస్క్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ వెళ్లి మోసపోయిన బాధితులకు అండగా.. గల్ఫ్ ఏజెంట్ల మోసాలకు చెక్ పెడుతూ కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఉపాధితో పాటు వివిధ రకాల ఉద్యోగాల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు ఏజెంట్ల మోసానికి గురవుతున్న సంఘటనలు, సందర్శన వీసాతో గల్ఫ్ దేశాలకు పంపుతూ అక్రమాలకు పాల్పడుతున్న సంఘటనల నేపథ్యంలో అక్రమ దోపిడీకి చెక్ పెట్టేందుకు హెల్ప్ డెస్క్ ఎంతగానో దోహద పడుతుందన్నారు. కలెక్టరేట్‌లోను గోదావరి భవన్‌లో విదేశాలకు వెళ్లాలనుకునేవారు, వెళ్లి మోసపోయినవారు, ఏజెంట్లుగా వ్యవహరించే వారితో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని అనుమతులతో గల్ఫ్ దేశాలకు పంపించేందుకు విదేశీ వ్యవహారాల హెల్ప్ డెస్క్‌ను నెలకొల్పుతామన్నారు. గత ఆరు నెలలుగా వివిధ మార్గాల్లో జిల్లాలో మోసపోయిన నిరుద్యోగ యువత నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించామన్నారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారితో సమగ్రంగా చర్చించి మార్గనిర్దేశనం చేయడానికి హెల్ప్ డెస్క్ దోహదపడుతుందన్నారు. కలెక్టరేట్‌లో 15 రోజుల్లో ఏడుగురు సిబ్బందితో ఏడాది పొడవునా పనివేళల్లో హెల్ప్ డెస్క్ పనిచేసే విధంగా ప్రారంభిస్తామన్నారు. ఒక ఉద్యోగం పేరు చెప్పి విదేశాల్లో వేరొక అసాంఘిక ఉద్యోగం ఇప్పించడం జరుగుతుందని, అటువంటి వాటికి కూడా చెక్ పెడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఏజెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లాలని, తద్వారా అక్కడ ఏ ఇబ్బంది వచ్చినా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ విదేశాలకు వలస వెళ్లి ఉద్యోగాలు చేయాలనుకునే నిరుద్యోగ యువతకు హెల్ప్‌డెస్క్ ఒక వరంగా నిలుస్తుందన్నారు. వలసదారుల రక్షణచట్టం హైదరాబాద్ ప్రతినిధి అంగర రవికుమార్ మాట్లాడుతూ విదేశీ ఉద్యోగార్థులు లైసెన్సు పొందిన నియామక ఏజెంట్లతో మాత్రమే సంప్రదించాలని విదేశాల వ్యవహారాలశాఖ సూచిస్తుందన్నారు. లైసెన్సు లేకుండా విదేశాలకు పంపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ఏయే దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నవీ, ఏ విధంగా ఉద్యోగులు పొందవచ్చో తదితర అంశాలను వివరించారు. పలువురు మోసపోయిన వ్యక్తులు తమకు జరిగిన అన్యాయాన్ని అధికారులకు వివరించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, వికాసా పీడీ కె.లచ్చారావు, డీఎస్డీవో హరిశేషు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంపై ఆసక్తి పెంపొందించాలి



సెమినార్ ప్రారంభిస్తున్న డీఆర్వో రాజకుమారి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు వ్యాయామంపై ఆసక్తిని పెంపొందించాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపుతున్నారే తప్ప వ్యాయామం పట్ల ఆసక్తి చూపడం లేదన్నారు. వ్యాయామానికి దూరం కావడంతో శారీరక, మానసిక ఒత్తిళ్లకు విద్యార్థులు గురవుతున్నారన్నారు. వ్యాయామ విద్య ఆవశ్యకతను తెలియచేసేందుకు జిల్లాలో నూతన ఒరవడికి నాంది పలుకుతూ అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జిల్లాస్థాయి వ్యాయామ ఉపాధ్యాయులతో సెమినార్ నిర్వహించారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవితో కలిసి డీఆర్వో జ్యోతి ప్రజ్వలనచేసి సెమినార్‌ను ప్రారంభించారు. జిల్లాకు క్రీడా పరంగామంచి గుర్తింపును తీసుకువచ్చి రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించేలా తర్ఫీదు ఇవ్వాలని డీఆర్వో పిలుపునిచ్చారు. ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ ఆధునిక యుగంలో ప్రతీ ఒక్కరు చదువు పట్ల ఏ విధమైన ఆసక్తిని చూపుతున్నారో అదేస్థాయిలో వ్యాయామాన్ని అలవరచుకుని మానసిక, శారీరక ఉల్లాసాన్ని, మంచి ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన కోనసీమ క్రీడోత్సవాలు విజయవంతం కావడంలో వ్యాయామ ఉపాధ్యాయుల కృషి ఎంతగానో ఉందని కొనియాడారు. వ్యాయామ విద్యకు సంబంధించిన కొత్త పరిశోధనలు, సాంకేతికతల గురించి సెమినార్‌లో చర్చించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. వ్యాయామ విద్యను అభివృద్ధి చేయడానికి మార్గాలను అన్వేషించాలన్నారు. కార్పొరేట్ జీవన విధానంలో వ్యాయామానికి ప్రతీ విద్యార్థి కొంత సమయం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్, ఉప విద్యాశాఖాధికారి పీవీ సుబ్రహ్మణ్యం, ప్రసాద్, శ్రీనివాస్, గౌరీశంకర్, గణపతి, రామారావు పాల్గొన్నారు.

లంక గ్రామాల వంతెనలకు

డీపీఆర్ సర్వే

టీడీపీ హయాంలో 2 బ్రిడ్జిలకు భూమిపూజ

వైసీపీ హయాంలో పట్టించుకోని యంత్రాంగం



సర్వే నిర్వహిస్తున్న అధికారులు



పుచ్చల్లంక వద్ద శిలాఫలకం

పి.గన్నవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు వస్తే చాలు ఆ లంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వరదల కాలంలో అత్యవసర పనులకు, వైద్య సేవలకు వారు పడే బాధలు వర్ణనాతీతం. దీంతో 2014-19 టీడీపీ ప్రభుత్వంలో పశ్చిమగోదావరి జిల్లా గ్రామం పుచ్చల్లంక నుంచి వశిష్ఠ నదీపాయ అవతలి ఒడ్డున దీవిపై ఉన్న అయోధ్య లంకను కలిపే విధంగా ప్రణాళిక నిధులు రూ.50 కోట్లు అంచనా వ్యయంతో వంతెన నిర్మాణానికి అప్పటి మంత్రి పితాని సత్యనారాయణ 2014 ఫిబ్రవరి 2న భూమి పూజ కూడా చేశారు. అలాగే వైవీ పాలెం దిగువన పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతాలైన అనగార్లంక, పెదమల్లంక లంక గ్రామాలకు ఏటిగట్టు నుంచి వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అయితే టీడీపీ హయాంలో శంకుస్థాపనలతోనే వంతెనల కల నిలిచిపోయింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటికీ పట్టించు కోకపోవడంతో లంక గ్రామాల ప్రజల కల సాకారం కాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లంక గ్రామాల ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకుని వంతెనలపై దృష్టి సారించింది.

వంతెనల నిర్మాణానికి డీపీఆర్ సర్వే

పీఎంజీఎస్‌వై నిధులు రూ.165 కోట్లతో ప్రతిపాదనలు

పుచ్చల్లంక-అయోధ్యలంక, వైవీపాలెం ఏటిగట్టు నుంచి అనగార్లంక, పెదమల్లంక గ్రామాలను కలిపే రెండు వంతెనల నిమిత్తం పాలకొల్లు సబ్ డివిజన్ పంచాయతీరాజ్ ప్రాజెక్టు అధికారులు మంగళవారం వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కోసం సర్వే నిర్వహించారు. అనగార్లంక వంతెన నిర్మాణానికి (పీఎంజీఎస్‌వై నిధులు) రూ.70 కోట్లు, అయోధ్యలంక వంతెన నిర్మాణానికి (పీఎంజీఎస్‌వై నిధులు) రూ.95 కోట్లు అంచనాలను రూపొందించినట్లు పాలకొల్లు పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ప్రాజెక్టు డీఈ జి.వెంకటరత్నం తెలిపారు. అయోధ్యలంక, మర్రిమూల గ్రామాలకు వంతెన నిర్మించి పుచ్చల్లంక వద్ద సీసీ రోడ్డుకు కలపనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే అనాగర్లంక, పెదమల్లంలంక గ్రామాలు నుంచి ఏటిగట్టు వరకు హైలెవెల్ బ్రిడ్జి నిర్మించి అక్కడ నుంచి ప్రధాన పంట కాల్వపై వంతెన ద్వారా ఆర్అండ్‌బీ రోడ్డుకు అనుసంధానం చేస్తామన్నారు. ఈ వంతెనలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, స్థల సేకరణ, స్థానిక సమస్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు సర్వే నిర్వహించారు. పూర్తిస్థాయి నివేదిక, డిజైన్‌లను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి పరిపాలనాపరమైన ఆమోదం లభించిన తర్వాత టెండర్లు పూర్తి చేసుకుని వంతెనల నిర్మాణ పనులు పట్టాలెక్కనున్నాయని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా ప్రాంతంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉండటంతో లంక గ్రామాల ప్రజలకు వంతెనల కల ఈసారి నెరవేరుతుందని స్థానికులు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వేలో ప్రాజెక్టు జేఈ మెహర్‌బాబా, సిబ్బంది ఉన్నారు.

రహదారి పటిష్టతకు లైమ్ స్టేబిలేషన్ పద్ధతి



పోతవరం వద్ద పనులు

పి.గన్నవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రహదారి పటిష్టతకు లైమ్ స్టేబిలేషన్ పద్ధతిని ఆర్అండ్‌బీలో మొట్టమొదటి సారిగా పి.గన్నవరంలో చేపడుతున్నారు. పి.గన్నవరం-అంబాజీపేట రహదారి అభివృద్ధిలో భాగంగా పోతవరంలో తరచూ దిగిపోతున్న ప్రదేశంలో ఆర్అండ్‌బీ అధికారులు నూతన పద్ధతిని అవలంబిస్తున్నారు. సుమారు మీటరు లోతు దాటి రహదారిని తవ్వేసి అక్కడ సున్నంతో రాళ్లను కలుపుతున్నారు. వాటిని ప్రత్యేకంగా ఎక్స్‌కవేటర్ తొండానికి తయారు చేసిన పళ్లతో 400 ఎంఎం లోతు వరకు కలుపుతున్నారు. అనంతరం వాటరింగ్ చేసి రోలింగ్ చేస్తున్నారు. ఈ పద్ధతిలో మట్టి, సున్నం కలిసి ఆ ప్రదేశం గట్టి పడుతుందని అధికారులు చెబుతున్నారు. రోడ్డు దిగిపోతున్న ప్రదేశం 360 మీటర్లు మేర రహదారికి ఇదే పద్ధతిని అవలంబిస్తున్నట్లు ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర తెలిపారు. పోతవరంలో లైమ్ స్టేబిలేషన్ పద్ధతి విజయవంతం అయితే రాష్ట్రంలో ఆర్అండ్‌బీ రోడ్లు పరిధిలో కుంగిపోతున్న ప్రదేశాల్లో ఇదే పద్ధతిని అవలంబించనున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

క్రీడలపై ఆసక్తితోనే సహాయం చేస్తున్నా

● ఎంవీఎస్ సత్యనారాయణరాజు, వ్యాపారవేత్త



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): నాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. వాలీబాల్ ఆడుతుండే వాడిని. హాకీ కోచ్ రవిరాజా, కాకినాడ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్రప్రసాద్ పరిచయంతో హాకీపై మక్కువ ఏర్పడింది. అందుకే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి కావాల్సిన క్రీడా పరికరాలు అందిస్తూ ప్రోత్సహిస్తుంటాను. అలాగే హాకీ క్రీడాకారులకు కూడా సహాయ సహకారాలు అందిస్తుం టాను. స్పోర్ట్స్ ద్వారానే స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది. ఇదే స్ఫూర్తితో జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి స్పాన్సర్‌గా వ్యవహరించడమే కాకుండా, ఈ నెల 21న క్రీడాకారులకు మంచి క్యాంప్ ఫైర్ ఏర్పాటు చేయడంతో పాటు బడాఖానా ఏర్పాటు చేస్తున్నాం.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

● కాకినాడలో కొనసాగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



కాకినాడ క్రీడా మైదానంలో తలపడుతున్న ఆంధ్రా, గోవా జట్ల క్రీడాకారులు



పోటీల్లో విజేతగా నిలిచిన ఆంధ్రా జట్టు



కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ పట్టణంలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ పోటీలు నాల్గో రోజైన మంగళవారం ఉల్లాసంగా ఉత్సాహభరితంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లతో మొత్తం ఎనిమిది మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ పోటీలకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్, వెటరన్ వాలీబాల్ క్రీడాకారుడు సూర్యనారాయణరాజు, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు లంక జార్జ్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ పట్టాభిరామ్, సీనియర్ హాకీ కోచ్ మురళీధర్, డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు, తదితరులు హాజరయ్యారు. ఇందులో ఒడిశా సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా సెక్రటేరియట్ 16-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, తెలంగాణ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 18-0 తేడాతో విన్ అయ్యింది. బీహార్ సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీహార్ సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. అలాగే గుజరాత్ సెక్రటేరి యట్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ సెక్రటేరియట్ జట్టు 11-2 తేడాతో గెలిచింది. పాండిచ్చేరి సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్టు 6-4 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్పీబీ సిమ్లా, ఆర్ఎస్పీబీ జైపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్పీబీ జైపూర్ 9-2 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్పీబీ ముంబై, ఆర్ఎస్పీబీ చెన్నై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్పీబీ ముంబై 5-1 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, గోవా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 23-0 తేడాతో విజయం సాధించింది. విజేత జట్లను ప్రకటించారు.

● పర్యాటక ప్రాంతాలను సందర్శించిన క్రీడాకారులు

దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు కాకినాడ జిల్లాలో పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. కోరంగి మడఅడవులు, వాకలపూడి బీచ్. శిల్పారామం, అన్నవరం సత్యదేవుని ఆలయం, యానాం, ఉప్పాడ, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామల్లో శివాలయాలను సందర్శిస్తున్నారు.



హాకీ ఆడుతున్న మహిళా క్రీడాకారులు



కాకినాడ జిల్లా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్ శ్రీధర్



పాయింట్ల కోసం ఉత్సాహంగా ఆడుతున్న దృశ్యం

అప్పట్లో ఇన్ని సౌకర్యాలు ఉండేవి కాదు

● కేఎల్ నాగమణి, ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్, ఏపీ ఉమెన్ టీం కెప్టెన్

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మేము ఆడే రోజుల్లో ఇన్ని సౌకర్యాలు ఉండేవి కాదు. అయినా క్రీడలపై మక్కువతో ఎంతో ఇష్టంగా నేర్చుకునే వాళ్లం. ఆడడానికి హాకీస్టిక్స్, కాళ్లకు షూస్ గానీ ఉండేవి కావు. అప్పుడు నేడు పడ్డ కష్టానికి ఫలితమే హాకీ క్రీడకు చేసిన సర్వీస్‌కి గుర్తింపుగా 2019లో అప్పటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకోగలిగాను. ఇప్పుడైతే హాకీ క్రీడాకారుల కోసం కాకినాడలో కోట్లు ఖర్చుపెట్టి ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్ ఏర్పాటు చేయడంలో కలెక్టర్ షాన్‌మోహన్‌కి క్రీడల పట్ల ఆయనకు ఉన్న ఇష్టం తెలుస్తుంది. దీనికి గాను హాకీ కోచ్ రవిరాజు కృషి ఎంతో ఉంది. అందుకు తగ్గ ఫలితమే ఆలిండియా సివిల్ సర్వీసెస్ వంటి గొప్ప టోర్నమెంట్‌కి కాకినాడ వేదికగా నిలిచింది.



శివయ్యా.. దారి చూపయ్యా!?



- కుంభమేళాకు వెళ్లేదారిలేక ఇక్కట్లు
- నేరుగా ఒకటే రైలు..విపరీతమైన రద్దీ
- వేలాది మంది భక్తుల్లో అసంతృప్తి
- ప్రత్యేక బస్సుల్లో నిండుతున్న సీట్లు
- ఇప్పుడైనా రైళ్లు వేయాలని వినతులు
- 26తో మహా కుంభమేళా ముగింపు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కుంభమేళాకు వెళ్లాలంటే ఈ ప్రాంతవాసులు రైలు రిజర్వేషన్లతో కుస్తీ పట్లు పట్టాల్సి వస్తోంది. చాంతాడంత వెయిటింగ్ లిస్టులు చూస్తుంటే శివ.. శివా అని ఆశువుగా నోటి నుంచి వచ్చేస్తోంది. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది. అయితే ఆ మేరకు రైళ్లు మాత్రం లేవు. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉన్న పురందేశ్వరి రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా.. కుంభమేళా రైళ్లు నడపడంలో మాత్రం ఈ ప్రాంతానికి ఆ మేరకు ప్రాధాన్యం దక్కలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్‌కి వందల రైళ్లు నడుపుతున్నామంటూ దక్షిణ మధ్య రైల్వే ఎంతో గర్వంగా చెబుతున్నా కాకినాడ నుంచి మాత్రం ఒకే ఒక్క వారాంతపు రైలు వేశారు. అటు విజయవాడ, ఇటు విశాఖ నుంచి రైళ్లు వేసినా పుష్కర ప్రాముఖ్యం ఉన్న రాజమహేంద్రవరం ప్రాంతంపై ఎందుకనో చిన్న చూపు చూశారు. మరో వైపు ప్రత్యేక బస్సులు వేస్తున్నా తక్కువ సమయంలో సీట్లు నిండుకుంటు న్నాయి. మహా శివరాత్రి పర్వదినమైన ఈ నెల 26వ తేదీతో మహా కుంభమేళా ముగుస్తున్నా రైళ్ల సంఖ్యలో మాత్రం పెరుగుదల లేకపోవడంపై జనం విస్తుపోతున్నారు. కనీసం ఇప్పుడైనా రెండు మూడు ప్రత్యేక రైళ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు.

శివా.. ఎలా వచ్చేది!



రాజమండ్రి నాలుగు జిల్లాలకు ప్రధాన రైల్వే స్టేషన్. అటు కోనసీమ, ఇటు తీరప్రాంతం కాకినాడ, ఓ వైపు తూర్పు మన్యం, మరోవైపు ఆధ్యాత్మిక ధామం రాజమహేంద్రవరం. ప్రతిరోజూ సుమారు ఈ రైల్వే స్టేషన్ నుంచి 35 వేల మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఇక్కడి నుంచి కుంభమేళాకు ఒకటే ప్రత్యేక రైలు వేశారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు తదితర ప్రాంతాల నుంచి కేవ లం 15 వరకూ బస్సులను నడపగలిగారు. బస్సులో వెళ్లడం అందరికీ సాధ్యపడదు. టికెట్ ధర రూ.13 వేల వరకూ ఉండగా.. దాదాపు 13 పుణ్యక్షేత్రాలు చూపిస్తున్నారు. బస్సు జర్నీ మొత్తం 11 రోజుల పడుతోంది. దీంతో వద్దులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వెనకడుగు వేయక తప్పదు.రైలులో అయితే 20-24 గం టల్లో ప్రయాగ్ రాజ్ చేరుకోవచ్చు.ఇప్పటికైనా 26 వరకూ రిజర్వేషన్,జనసాధారణ్ రైళ్లను నడపాలనే డిమాండ్ వినవస్తోంది.

నేరుగా ఒకటే రైలు

రాజమండ్రి గుండా వెళ్లేలా కాకినాడ నుంచి ఒకే ఒక ప్రత్యేక రైలును నడుపుతున్నారు. అది కూడా గురువారం మాత్రమే. ఇది పూర్తిగా ఏసీ రైలు కావడంతో టికెట్ ధర రూ.2180 చెల్లిం చాలి. ఇది సాధారణ భక్తులకు భారమే అయినప్పటికీ ఆ రైలుకు వెయిటింగ్ లిస్ట్ 180కి చేరుకొంది. ఢిల్లీ వెళ్లి అక్కడి నుంచి వెళ్దామని అనుకున్నా రాజమహేంద్రవరం నుంచి రోజూ ఏపీ ఎక్స్‌ప్రెస్ ఒకటే అందుబాటులో ఉంది. దీనికీ వెయిటింగ్ లిస్ట్ 80 దాటింది. వారానికి రెండు సార్లు స్వర్ణ జయంతి నడుస్తోంది. ఇలా బ్రేక్ జర్నీల్లో ఒక రైలుకు రిజర్వేషన్ దొరికితే మరో రైలుకు దొరక్కపోవచ్చు. దీంతో చాలామంది ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నారు. ఇక విజయవాడ నుంచి చూస్తే వారాంతపు రైళ్లయిన చెన్నై-గయ, పాటలీపుత్ర, కన్యాకుమారి-కాశీ(2), కోయంబత్తూరు-ధన్‌బాద్ టికెట్లు లేవు. రోజూ నడిచే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో కూడా సీట్లు ఖాళీ లేవు. విశాఖపట్నం నుంచి సోమవారం, బుధవారం, శనివారం కుంభమేళా స్పెషల్స్ వేసినా వాటికి వెయిటింగ్ లిస్ట్ 200 దాటిపో యింది. విమానం విషయానికొస్తే.. హైదరాబాద్ గుండా ప్రయాగ్ రాజ్ సర్వీసులు ఉన్నాయి. అయితే ధర మాత్రం ఒక్కో వెబ్‌సైటులో ఒక్కోలా ఉంది. ఓ వెబ్‌సై టు రూ.18-23 వేలు చూపిస్తుండగా.. మరో వెబ్‌సైటు లో 23వ తేదీకి ఏకంగా రూ.43 వేల టికెట్ ధర ఉంది. ఏదేమైనా విమానంలో ఇక్కడి నుంచి దంపతులు ప్రయాగ్‌రాజ్ వెళ్లి రావాలంటే లక్షణంగా రూ.లక్ష వరకూ ఖర్చవుతోంది. అటు బస్సుల్లో వెళ్లలేక, ఇటు రైళ్లలో ఖాళీ లేక, మరో వైపు విమానానికి డబ్బులు పెట్టలేక కుంభమేళాకు వెళ్లే దారి చూపాలని శివుడిని వేడుకొంటున్నారు.

నన్నయ యూనివర్శిటీ వీసీగా ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతరించి పోతున్న గిరిజన భాషలను కాపాడుకునేందుకు విశేష కృషి చేసి 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన తొలి మహిళామూర్తిగా ప్రసన్న నిలిచారు. 20 22లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు. 38 సంవత్సరాల బోధనా అనుభవంలో ఎన్నో భాషా, సాహిత్య సంస్కరణలకు కృషిచేసారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సెమినార్లు నిర్వహించారు. అనేక పరిశోధనా వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు అందుకున్నారు. నిత్యం భాషా, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రసన్నశ్రీ ప్రస్తుతం నన్నయ విశ్వవిద్యాలయం వీసీగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీగా ఆచార్య వై.శ్రీనివాసరావు ఏడు నెలలుగా కొనసాగుతున్నారు. ఆయన నన్నయ విశ్వవిద్యాలయంలో భూగర్భశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తూ గత ఏడాది జూలై 18న నన్నయ ఇన్‌ఛార్జి వీసీ బాధ్యతలు చేపట్టారు.

జేఎన్టీయూకే వీసీగా ప్రసాద్

వర్శిటీ 6వ వీసీగా బాధ్యతలు చేపట్టనున్న ప్రొఫెసర్

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే నూతన ఉపకులపతిగా ప్రొ ఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్, వర్శిటీ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ ప్రసాద్‌ను వీసీగా నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేసినట్టు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. ప్రసాద్ ప్ర స్తుతం తెలంగాణలోని వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో సివిల్ ఇంజనీరింగ్, ఎంటెక్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మూడేళ్ల పాటు జేఎన్టీయూకే ఉపకులపతిగా కొనసాగుతారు. గుంటూరు జిల్లాకు చెందిన సీఎస్ ఆర్కే ప్రసాద్ తల్లిదండ్రులు సాంబశివరావు, వెంకట సుబ్బమ్మ. ఆయన గుంటూరు జిల్లా అమర్తలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, తెనాలిలోని వీఎస్ఆర్, ఎన్వీఆర్ కళాశాల్లో ఇంటర్ ఎంపీసీ, వరంగల్‌లోని రీజినల్ ఇంజనీరింగ్ కళాశాల(ప్రస్తుత ఎన్ఐటీ వరంగల్)లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రసాద్ పర్యవేక్షణలో ఇప్పటివరకూ 8మంది పీహెచ్‌డీ పూర్తిచేయగా ఐదుగురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. 2008లో జేఎన్టీయూకే విశ్వవిద్యాలయం ఏర్పాటు కాగా మొదటి ఉపకులపతిగా ప్రొఫెసర్ అల్లం అప్పారావు, రెండో వీసీగా జి.తులసీరామ్‌దాస్, మూడో వీసీగా వీఎస్ఎస్ కుమార్, నాలుగో వీసీగా ప్రొఫెసర్ ఎం.రామలింగరాజు, 5వ వీసీగా ప్రొఫెసర్ జీవీ ఆర్ ప్రసాదరాజు వి. ధులు నిర్వర్తించగా 6వ వీసీగా ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

బాలబాలాజీ హుండీల ఆదాయం రూ.43.30 లక్షలు



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులోని అప్పనపల్లి బాలబాలాజీ హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్ష ణలో మంగళవారం తెరిచి లెక్కిం చారు. 68 రోజులకు ప్రధాన హుం డీల ద్వారా రూ.43,30,182 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 13గ్రాముల బంగారం, 131 గ్రాముల వెండి లభించిందన్నారు. లెక్కింపులో ఆలయ అర్చకులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, బ్యాంక్ ఆఫ్ బరోడా అప్పనపల్లి శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి మన్యంలో 'ఆర్గానిక్ సెజ్'

- సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నాం
- పోలవరం పునరావాసమూ ప్రాధాన్యాతాంశమే
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



రంపచోడవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి మన్యం జిల్లాలో ఆర్గానిక్ వ్యవసాయ, ఉద్యానవన తదితర అంశాల ప్రాధాన్యంగా స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఎస్ఈజెడ్) ఏర్పాటు దిశగా సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అన్ని అంశాల్లో గిరిజనుల భాగస్వామ్యం ఉండా లన్న ప్రభుత్వ నిర్దేశాన్ని అమలు చేసే చర్యలు చేపడుతున్నామని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రంప చోడవరం పర్యటనకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన వన రంగాల వృద్ధి ద్వారా గిరిజన జీవన ప్రమాణాలను పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అరకు కాఫీ, రంప రబ్బరు, అనేక కలపేతర అటవీ ఉత్పత్తులు కొన్ని దశాబ్దాలుగా గిరిజనుల ద్వారా వచ్చి అనేక చేతులు మారి మైదాన ప్రాంతాలకు, ఇతర దేశాలకు కూడా దళారుల ద్వారా ఎగుమతి అవుతు న్నాయన్నారు. ఆయా ఉత్పత్తుల విలువ హెచ్చింపు చర్యలను గిరిజనులతోనే అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులతో చేపట్టి తద్వారా వాటికి మంచి గిట్టుబాటు రప్పించే దిశగా చర్యలు చేపడుతు న్నామన్నారు. ఇందులో భాగమే ఆర్గానిక్ సెజ్ అన్నారు. ఈ ఎస్ఈజడ్ పూర్తిగా గిరిజనుల భాగస్వామ్యంతో, గిరిజన సంక్షేమ అనుబంధ వ్యవస్థల సహాయంతో ఏర్పాటవుతుం దన్నారు. తద్వారా ఇక్కడి ఉత్పత్తులకు ప్రత్యేక విలువ కలిగి అంతర్జాతీయ మార్కెట్లో కూడా స్థానం దక్కుతుందన్నారు.


విజన్ డాక్యుమెంట్ల రూపకల్పన

రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏల ద్వారా గిరిజనాభివృద్ధికి విజన్ డాక్యు మెంట్లను రూపొందిస్తామన్నారు. మన్యంలో అధికారులు గిరిజన హక్కులను పరిరక్షించాలన్నారు. గిరిజనుల హక్కులు, గిరిజన ప్రాంత వనరుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తో ఉందన్నారు. గిరిజనుల హక్కు లకు ఎక్కడ భంగం కలిగినా ఉపేక్షిం చేది లేదని, గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమ లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఉన్న వ్యవస్థలను మరింత పటిష్ఠపరుస్తున్నామన్నారు. గిరిజన చట్ట ఉల్లంఘనలపై నమోదై పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలన్న లక్ష్యాలను ఆయా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులకు, అదనపు ఏజెంటు కోర్టులకు నిర్దేశించామని చెప్పారు.

'జన్‌మన్' ఇళ్ల పూర్తికి చర్యలు


అల్లూరి జిల్లాలో ఆదిమ జాతి గిరిజనులు (పీవీటీజీ) కోసం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిధులతో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద 25,578 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిని త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. అదనంగా 576 రహదారులు, 1660 మంచినీటి పథకాలు మంజూరయ్యాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పునరావాస చర్యలను వేగవంతం చేస్తున్నామన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

డెల్టా కాలువలకు 8600 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 8600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4300 క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదల అవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 8600 క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.60అడుగులుగా నమోదయింది.

అప్పుడే ఎండ తీవ్రత!



అప్పు'డే' ఎండల తీవ్రత పెరిగింది. ఫిబ్రవరిలోనే వేడిమి వాతావరణం మొదలైంది. మంచు, చలి ఉధృతంగా ఉండాల్సిన సమయంలో ఉదయం నుంచే ఎండ మండుతోంది. నాలుగైదు రోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 35 నుంచి 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అంతకుమించి నాలుగైదు డిగ్రీలు అధికంగా ఉందన్న స్థాయిలో ఎండ తీవ్రత ఉంది.

- ఫిబ్రవరిలోనే మొదలైన వేడి వాతావరణం
- శివరాత్రి రాకుండానే ఉక్కబోత ప్రారంభం
- అత్యధిక ప్రాంతాల్లో 35 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు అధికం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 11గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లా అంతటా వేడి వాతావరణమే కనిపిస్తోంది. రాత్రికి ఉక్కపోత కూడా పెరిగింది. సాధారణంగా ఈ సమయంలో జిల్లాలో 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. పగటిపూట కూడా చలి వాతావరణమే ఉంటుంది. అర్ధరాత్రి నుంచి చలితో కూడిన మంచుపడుతూ ఉదయం 9గంటల వరకు ఆ ప్రభావం ఉంటుంది. అనంతరం కూడా ఎండ పెద్దగా ఉండదు. శివరాత్రి పండుగ వరకు ఈ తరహా వాతావరణం కొనసాగుతుంది. అనంతరం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. ఈ ఏడాది అందుకు భిన్నంగా కనిపిస్తోంది. శివరాత్రి ఇంకా 8రోజులు ఉండగా అప్పుడే ఎండల తీవ్రత పెరిగింది.

ఈ వేసవిలో ఎండలు అధికమే..

ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ సంకేతాలు ఇస్తుండగా ఆ ప్రభావం ఇప్పటినుంచే కనిపిస్తోంది. జిల్లాలోని అత్యధికప్రాంతాల్లో నాలుగైదురోజులుగా మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదువుతోంది. క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. కాకినాడలో మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా ఉంది. ఇక్కడ ఈనెల 1న 31.7 డిగ్రీలు, 2న 32.7 డిగ్రీలు, 3న 34.3 డిగ్రీలు నమోదైంది. గత నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రత పెరిగింది. ఈ సమయంలో ఇలాంటి వాతావరణం ఉండడంతో వేసవిలో ఏస్థాయిలో ఎండలు ఉంటాయోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతుంది.

ఉపాధి నిమిత్తం వెళ్లి..
కువైట్‌లో మృతి


తారక ముత్యాలరాము (ఫైల్)


ఆవేదన వ్యక్తం చేస్తున్న రాము కుటుంబ సభ్యులు

- ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపిన తోటి డ్రైవర్
- మృతుడిది కోనసీమ జిల్లా మొగలికుదురు
- వేధింపులు తాళలేకే బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని కుటుంబసభ్యుల ఆరోపణ

మామిడికుదురు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పరాయి దేశానికి వెళ్లిన ఆ యువకుడు అర్ధంతరంగా తనువు చాలించాడు. కారణం ఏంటనేది స్పష్టంగా తెలియనప్పటికీ ఉద్యోగంకోసం వెళ్లిన కుమారుడు అకస్మాత్తుగా మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వేధింపులు భరించలేకపోతున్నానని ఫోన్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మొగలికుదురుకు చెందిన నేదూరి రామలక్ష్మి-సురేష్ దంపతుల కుమారుడు నేదూరి తారక ముత్యాలరాము(24) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లాలనుకుని కొమరాడకు చెందిన వలవల నాగరాజును సంప్రదించాడు. వీసా నిమిత్తం అతడికి రూ.85వేలు కూడా ఇచ్చాడు. గతేడాది డిసెంబరు 28న బయలుదేరి జనవరి 1న కువైట్‌లో అడుగుపెట్టాడు. అప్పటినుంచి నాగరాజు వేధింపులు భరించలేకపోతున్నానని రాము పలుమార్లు తమకు ఫోన్‌లో చెప్పేవాడని, కొన్నిరోజులు పోతే వేధింపులు తగ్గుతాయని తమ కుమారుడికి నచ్చచెప్పినట్టు తల్లిదండ్రులు తెలిపారు. తమ యజమాని మంచివాడే కానీ తన సాటి డ్రైవర్‌గా చేస్తూ తనతోపాటే రూములో ఉండే నాగరాజు మాత్రం తనను నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడని పలుమార్లు తమ దృష్టికి తెచ్చాడని వారు వాపోయారు. ఈనెల 13న గురువారం సాయంత్రం రాము కనిపించడం లేదని, ఎక్కడికో పారిపోయాడని కువైట్‌లోనే ఉంటున్న తమ బంధువులకు నాగరాజు ఫోన్ చేసి చెప్పాడన్నారు. అదేరోజు సాయంత్రం స్థానికంగా ఉన్న బీచ్ వద్ద పాడుపడిన బంగ్లాలో రాము ఉరివేసుకున్నాడని సమాచారం ఇచ్చాడన్నారు. దీంతో తమ బంధువులు కూడా సంఘటనా స్థలానికి వెళ్లి చూశారన్నారు. దీంతో వారు ఇండియన్ ఎంబసీ అధికారులు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతో ఈనెల 17వతేదీ సోమవారం మృతదేహం స్వగ్రామం వచ్చిందని రాము తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడని కాదని, వీసా తీసిన వ్యక్తి వేధింపులకు పాల్పడడంవల్ల మరణించాడా లేక మరేమైనా జరిగిందా అన్న అనుమానంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఈనెల 14న నగరం పోలీస్‌స్టేషన్‌లో, తహశీల్దార్ కార్యాలయంలోను, 15న కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని మృతుడి తల్లిదండ్రులతోపాటు సోదరుడు ఫణీంద్రకుమార్ తెలిపారు.

దొంగసాధువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పెద్దాపురం పోలీసుల హెచ్చరిక


సీసీ ఫుటేజీలో దొంగ సాధువు

పెద్దాపురం(సామర్లకోట), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దొంగ సాధువులపట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో రెండురోజులుగా సాధువునని నమ్మించి ఓవ్యక్తి స్థానిక దుకాణాలవద్ద ఆశీర్వాదాలు అందిస్తున్నట్లు నటించి వారి నుంచి సొమ్ములను తీసుకుని పరారీ అవుతున్నట్లు పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఇటువంటి దొంగ సాధువులెవరైనా షాపులవద్దకు వస్తే తక్షణం తమకు సమాచారమివ్వాలని పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

బాలిక అనుమానాస్పద మృతి


మృతదేహం వద్ద రోధిస్తున్న బాలిక కుటుంబసభ్యులు

- ఆమెను పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు
- అతడి వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుందని స్థానికులు, బాలిక కుటుంబీకుల ఆరోపణ
- గతంలోనూ అతడిపై కేసు

సామర్లకోట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం మాధవపట్నంలో బాలిక అనుమానాస్పదస్థితిలో సోమవారంరాత్రి మృతి చెందగా ఈ సంఘటనలో అనుమానితుడిగా ఉన్న వ్యక్తిని సామర్లకోట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

సామర్లకోట మండలం మాధవపట్నంలో 17 ఏళ్ల దళిత బాలికను అదే గ్రామానికి చెందిన అనుసూరి విఘ్నేశ్ గతంలో ప్రేమ పేరిట వేధించేవాడు. దీంతో 2023లో బాలిక ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిపై అప్పట్లో ఎస్సీ,ఎస్టీ, పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన విఘ్నేశ్ ఆ బాలిక వద్దకు వెళ్లి తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమెకు మాయమాటలు చెప్పి వివాహం కూడా చేసుకున్నాడు. కొంతకాలం అదే గ్రామంలో బాలికతో కాపురం పెట్టాడు. ఇటీవలకాలంలో ఆమెపై వేధింపులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో రెండురోజులుగా వారిద్దరి మధ్య ఘర్షణలకు జరుగుతున్నాయని, ఆమె శారీరకంగా వేధించాడని స్థానికులు తెలిపారు. ఈ బాధలు భరించలేక సోమవారం రాత్రి ఆమె అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉండడాన్ని చుట్టుపక్కల ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలికను విఘ్నేశ్ తీవ్రంగా కొట్టడంవల్లే ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ మేరకు సామర్లకోట పోలీసులు కేసును వేగవంతంగా దర్యాప్తు నిర్వహించారు. ప్రాథమిక విచారణ మేరకు నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేశారు. అతడిని కఠినంగా శిక్షించాలని బాలిక కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

సాదాసీదాగా జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు




జడ్పీ సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యులు, మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా శాఖాపరమైన సమీక్షల్లేవు..
- తీర్మానాలు లేవు
- కోరం లేక గంట ఆలస్యంగా ప్రారంభం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్.. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనల ప్రకారం సమావేశాలు నిర్వహించాల్సిన తీరు.. దీనికితోడు మెజారిటీ సభ్యులు నిర్ణీత సమయానికి రాకపోవడంతో కోరం లేక జడ్పీస్థాయీ సంఘ సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభించారు. అది కూడా ఏ విధమైన శాఖాపర సమీక్షలు చేయకుండా, తీర్మానాలు ఆమోదించకుండా సమావేశాలు సాదాసీదాగా ముగించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు మంగళవారం కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన 1, 2, 4, 7 స్థాయి సంఘ సమావేశాలు, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన 3వ స్థాయి సంఘ సమావేశం, వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన 6వ స్థాయి సంఘ సమావేశం, స్థాయి సంఘ చైర్ పర్సన్ రొంగల పద్మావతి అధ్యక్షతన 5వ స్థాయి సంఘ సమావేశం జరిగాయి. ఈ సమావేశాల్లో జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, జడ్పీటీసీ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు, జడ్పీ పరిపాలనాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'నిర్లక్ష్యం'పై వేటు!

- రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు
- నలుగురు డాక్టర్లు, ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు
- నిన్న మంత్రి సుభాష్ పర్యటన.. నేడు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ ఉత్తర్వులు


ఈఎస్ఐ ఆస్పత్రిలో సోమవారం హాజరుపట్టీ పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు డాక్టర్లు, ఐదుగురు కార్యాలయ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విజయవాడలోని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంత్రి సుభాష్ ఆదేశించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ తక్షణమే స్పందించి మంగళవారం ఈచర్యలు తీసుకున్నారు.

రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిని సోమవారం మంత్రి సుభాష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సమయంలో కొందరు వైద్యులు, కార్యాలయ సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. హాజరుపట్టీని ఆయన పరిశీలించారు. కొందరు డాక్టర్లు, కార్యాలయ సిబ్బంది హాజరు నమోదు చేసుకుని విధులు నిర్వర్తించకుండా ఆస్పత్రినుంచి వెళ్లిపోతున్నట్టు గుర్తించారు. అక్కడున్న మరికొందరు సరైన సమాధానం, సమాచారం కూడా ఇవ్వలేదు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి సుభాష్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్‌ను ఆదేశించారు. దీంతో విధినిర్వహణలో బాధ్యతారాహిత్యంగావ్యవహరించిన డాక్టర్లు, సిబ్బందిపై వేటు పడింది. కాగా, దీనిపై విచారణ కొనసాగుతోందని, నివేదిక ఆధారంగా మరిన్నిచర్యలు తీసుకుంటామని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఈఎస్ఐబీమా చందాదారులు, వారి కుటుంబీకులకు నాణ్యమైన వైద్యసేవలందజేసేందుకు కట్టుబడి ఉందని, రోగుల విషయంలో నిర్లక్ష్యం, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం



చింతూరు నుంచి డొంకరాయికి ఆటోలో తరలిస్తున్న మద్యం

చింతూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు నుంచి ఆటోలో డొంకరాయి బెల్టు షాపునకు అక్రమంగా తరలించబోయిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి చింతూరులోని షాపులకు మంగళవారం ఒక వ్యాన్‌లో మద్యం దిగుమతి అయింది. కాగా అదే వ్యాన్‌లో వై.రామవరం మండలం చవిటిదిబ్బలు వైన్‌షాప్ పేరిట 13 బీర్ కేసులు(156 బీర్లు), 11 కేసుల క్వార్టర్ బాటిళ్లు(528 బాటిల్సు) కూడా తరలించారు. ముందుగా అనుకున్న ప్రణాళిక మేరకు ఇక్కడినుంచి వై.రామవరం మండలం డొంకరాయిలోని ఒక బెల్టు షాప్‌నకు ఈ బాటిళ్లను తరలించేందుకు ఆటోలో లోడు చేశారు. విషయం పసిగట్టిన కొంతమంది వ్యక్తులు చింతూరులోని ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఎక్సైజ్ అధికారులు వ్యాన్, ఆటోల వద్దకు చేరుకుని అక్రమంగా తరలించబోతున్న మద్యం బాటిళ్లు, ఆటోని సీజ్ చేయడంతోపాటు ఆటో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఎక్సైజ్ ఎస్ఐ (చింతూరు) వై.వీరవెంకటసత్యలక్ష్మణస్వామిని సంప్రదించగా అక్రమ తరలింపునకు సిద్ధం చేసిన మద్యం సహా ఆటోను సీజ్ చేశామని, ఆటో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.లక్షా12వేల వరకు ఉంటుందన్నారు.

'పాదగయ'లో మహాశివరాత్రి ఉత్సవాలకు అదనపు సిబ్బంది

- సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత
- దేవదాయశాఖ ఆర్‌జేసీ సుబ్బారావు


పిఠాపురం పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు

పిఠాపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో జరిగే కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు సుబ్బారావు తెలిపారు. ఉత్సవాలకుగాను వివిధ ఆలయాలనుంచి అదనపు సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఆయన మంగళవారం సందర్శించుకున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. సామాన్య భక్తులకు దర్శనాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. దర్శనాల సమయంలో భక్తులను ఆపడం, ఆటంకాలు కల్పించడం చేయవద్దని అర్చకులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాదగయ పుష్కరిణి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. స్నానాలు ఆచరించిన తర్వాత భక్తులు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. పిండ ప్రదానాలు, మాసివాయనాల కోసం భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం తోపాటు వచ్చిన వారు త్వరగా కార్యక్రమాలు పూర్తి చేసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయం ఆవరణ, బయట పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. దేవాదాయశాఖ కమిషనరు ఆదేశాల మేరకు చీఫ్‌ఫెస్టివల్ ఆఫీసర్‌గా అన్నవరం దేవస్థానం ఏఈవోను నియమించినట్లు తెలిపారు. ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా దేవదాయశాఖ అధికారి దుర్గాభవానీ, పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సామర్లకోటలో పరిశీలన


సామర్లకోట భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్‌జేసీ

సామర్లకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించి స్థానిక అధికారులకు తగు సూచనలు చేశారు. సామర్లకోటలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయనున్నందున వారికి ఆలయ ఆవరణలో అన్ని రకాల సదుపాయాలు కలుగజేయాని సూచించారు. వీఐపీల దర్శనాలతో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సామర్లకోట ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, దేవదాయ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులోకి దూకి యువతి ఆత్మహత్య


అరుణ(ఫైల్‌ఫోటో)

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఉప్పుటేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడలోని సూర్యనారాయణపురానికి చెందిన అనపాల అరుణ(24) స్థానిక వెంకీ రెసిడెన్సీ హోటల్లో హౌస్ కీపర్‌గా పనిచేస్తోంది. కాగా ఆమె బయట అప్పులు అధికంగా చేస్తుండడంతో ఈనెల 16న తల్లిదండ్రులు మందలించారు. దీంతో అరుణ అదేరోజు రాత్రి 10.30గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబీకులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో అరుణ కుటుంబీకులు స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఉమెన్ మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అరుణ మృతదేహం స్థానిక జగన్నాథపురం ఉప్పుటేరులో తేలినట్లు మంగళవారం పోలీసులు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వాహనంతో నిలిచిన ట్రాఫిక్



రావులపాలెం హైవేపై వెళ్తున్న భారీ వాహనం

రావులపాలెం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గోపాలపురం రావులపాలెం జాతీయరహదారిపై భారీ వాహనం కారణంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇదే తరహా మరో మూడు వాహనాలు కూడా జాతీయ రహదారి వెడల్పున సరిపడగా ఒకేసారి ప్రయాణించడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఈతకోట టోల్‌గేట్‌వద్ద గౌతమి వంతెన మీద వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చెందుర్తిలో మరో 1500 కోళ్లు మృతి

ఖననం చేసిన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు



కోళ్లు ఖననం చేసిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తిలో పుష్కర-పోలవరం కాలువ గట్లుపై ఉన్న కోళ్ల ఫారంలో మరో 1500 కోళ్లు మంగళవారం మృత్యువాత పడ్డాయి. ఇప్పటివరకూ ఈ ఒక్కఫారంలోనే 6వేల కోళ్లు చనిపోయాయి. చనిపోయిన కోళ్లను జనావాసాలకు దూరంగా గోతులు తీసి ఖననం చేశారు. బర్డ్‌ఫ్లూ అనుమానిత కోళ్లు ఖననం చేసిన ప్రదేశం కాబట్టి ఇక్కడ ప్రజలు, వాహన రాకపోకలు నిషిద్ధమంటూ పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

స్టాక్ మార్కెట్ పేరుతో టోకరా

రూ.14.92 లక్షల ఆన్‌లైన్ దోపిడీ

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నారాయణపురానికి చెందిన బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసే బి.శ్రీనివాస్ అనే వ్యక్తి స్టాక్ మార్కెట్ పేరుతో వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి పెట్టుబడి పెట్టి రూ.14.92 లక్షల నగదు పోగొట్టుకున్నాడు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ 2024, డిసెంబరులో తన ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపు అవుతుందనే సందేశాన్ని చూసి దఫదఫాలుగా రూ.14లక్షల92వేలు పెట్టుబడి పెట్టారు. దీనికి సంబంధిచి రూ.40లక్షలు నగదు అతడికి రావాల్సిందని మెసేజ్‌లో చూపించింది. తనకు రావాల్సిన డబ్బుల కోసం సదరు ఆన్‌లైన్‌లో ప్రయత్నించగా వారు అకౌంట్ క్లోజ్ చేశారు. దీంతో బాధితుడు మంగళవారం ప్రకాష్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థికి షీల్డు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

'సాంకేతిక విద్యార్థులకు ఉజ్వల భవిత'

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ పాలిటెక్నిక్ కళాశాల వార్షిక వేడుకను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూసాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ ఫణిశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, కళాశాల కార్యదర్శి బోనం కనకయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజే రామారావు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యా ప్రావీణ్యంతో పాటు సహ పాఠ్య కార్యకలాపాలు, క్రీడలు అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జేసీ షీల్డులు అందజేశారు. పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

యలకల్లంకలో వైభవంగా రుద్ర యాగం



రుద్ర యాగ క్రతువులో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యలకల్లంకలో గౌతమి గోదావరి తీరాన శ్రీకోదండ రామాలయం, శంకర నారాయణ క్షేత్రంలో శ్రీరుద్ర యాగం వైభవంగా జరిగింది. బాదంపూడి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, మండపారాధన చేసి స్వామివారికి రుద్రాభిషేకం జరిపారు. అమ్మవారికి కుంకుమ పూజలునిర్వహించారు. మారేడుదళాలతో పూజ, రుద్రయాగం జరిపించారు. అనంతరం అఖండ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో గంగుమళ్ల శ్రీనివాస్, మార్ని వీరభద్రరావు, మాగాపు రాజు, జంగా డేవిడ్‌రాజు, పంతాడి రాంబాబు, బద్రి వెంకట్రావు, కోనే సాంబమూర్తి, చిక్కాల సీతారామ్, కురచ శ్రీరామకృష్ణ, దవళేశ్వరపు నాగమల్లేశ్వరరావు, అడ్డగళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు



ముమ్మిడివరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నిలిపి ప్రత్యేక పూజలు చేస్తారు. 20, 21 తేదీల్లో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. 22న సత్తెమ్మ తల్లి అమ్మవారి కథ చెప్పి పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తారు. 23న బాజాభజంత్రీలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తారు. ఆలయ, పరిసర ప్రాంతాల్లో పెద్దపెద్ద చలువ పందిళ్లు వేశారు. మహిపాలచెరువు, కాట్రేనికోన రోడ్డులో భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటుచేసి దేవతామూర్తులను విద్యుద్దీపాలతో అలంకరింపజేశారు. పుట్టింటి ఆడపడుచులు వచ్చి అమ్మవారికి ముడుపులు చెల్లించుకుంటారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వరి పైరుపై కాండం తొలిచే పురుగు, కుళ్లు తెగులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రబీ వరి చేలకు అక్కడక్కడా జింక్ ధాతు లోపం, కాండం తొలిచే పురుగు, కాండం కుళ్లు తెగులు ఆశించినట్టు తమ పరిశీలనలో తేలిందని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ తెలిపారు. రైతులు వెంటనే సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. మంగళవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ ఏవీఎస్ రాజశేఖర్‌తో ముమ్మిడివరం మండలం, అయినవిల్లి మండలంలోని మడుపల్లి, వెలువలపల్లి గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు.

'పదో తరగతి విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి'

అల్లవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి భయం లేకుండా పరీక్షలు రాయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ కోరారు. మంగళవారం ఆయన తూర్పులంక జడ్పీ హైస్కూలును సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి వెండి కిరీటం బహూకరణ

అంబాజీపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని అరిగెలవారిపాలెంలో శ్రీవీరభద్రస్వామికి అరిగెల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.80వేలు విలువైన వెండి కిరీటం బహూకరించారు. యర్రంశెట్టి శిరిడిసాయిరామ్ జ్ఞాపకార్థం అతని సోదరుడు వీరభద్రరావు రూ.18వేలు విలువైన ఇత్తడి మకరతోరణం బహూకరించారు. దాతలు వాటిని ఆలయ కమిటీ సభ్యులకు అందించగా సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించారు.

'ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి'

మామిడికుదురు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని డీపీఎం జె.ఎలియాజర్ కోరారు. కార్బన్ ఉద్గారాల నియంత్రణపై మాకనపాలెం, ఈదరాడ గ్రామాల్లో రెండు రోజులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరుతడి వ్యవసాయ విధానాలు, ప్రయోజనాలను ఎలియాజర్ రైతులకు వివరించారు. డ్రోన్లు ఉపయోగించి పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని పి.గన్నవరం ఉప సంచాలకుడు ఎస్‌జేవీ రామ్మోహనరావు తెలిపారు. ఏడీపీఎం ఎంవీవీ సత్యనారాయణ, ఏవో కె.శ్రీనివాస్, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, ఎన్ఎఫ్ఏ రాధిక, ఎంటీ నాగవేణి, జానకి, కె.పద్మావతి, రైతులు వై.సూరిబాబు, నయినాల శ్రీరంగనాథం, వై.లక్ష్మయ్య పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వానికి ఓటు అడిగే హక్కు లేదు'



విలేకరులతో మాట్లాడుతున్న హర్షకుమార్

మలికిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు అడిగే హక్కు లేదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. మలికిపురంలోని పూలే-అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన కుమారుడు జీవీ సుందర్ మంచి మేనిఫెస్టోతో బరిలో నిలిచాడన్నారు. తొమ్మిది నెలలు గడిచినా హామీలను అమలు చేయట్లేదని ఆరోపించారు. ఎస్సీలకు గతంలో రద్దు చేసిన పథకాలు అమలు చేస్తామని చెప్పి వాటి ఊసే ఎత్తట్లేదన్నారు. చింతా రాజబాబు, సరెళ్ల విజయ్ ప్రసాద్, దొమ్మేటి ఉమా, దేవ రాజేంద్రప్రసాద్, గెడ్డం తులసిభాస్కర్, గెడ్డం ఫిలిప్‌రాజు, కూనపరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సర్వే

ముమ్మిడివరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం, ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి, కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామాల్లో 1 నుంచి 18 సంవత్సరాలలోపు అంగవైకల్యం గల పిల్లలు ఎవరైనా ఉన్నారా అనే దానిపై ఇంటింటా సర్వే నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు బృందంగా ఏర్పడి సర్వే నిర్వహించి అంగవైకల్యంతో ఉండి సదరం సర్టిఫికెట్ లేనివారిని గుర్తించి వారిని సదరం క్యాంపులకు సిఫార్సు చేశారు.

ఆబోతుల కుమ్ములాటలో వ్యక్తికి గాయాలు

కాట్రేనికోన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో మంగళవారం సాయంత్రం రెండు ఆబోతుల మధ్య పోట్లాట జరిగింది. అవి అటుగా వెళ్తున్న వాహనచోదకుడిని కిందపడేసి కుమ్మేశాయి. వాహనం నుజ్జునుజ్జు కాగా ఆ వ్యక్తి అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు.

సౌరయాగంలో స్వాతి నక్షత్ర పూజలు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారంలో జరుగుతున్న నక్షత్ర నవగ్రహపూర్వక మహా సౌరయాగంలో 20వ రోజైన మంగళవారం స్వాతి నక్షత్ర పూజలు జరిపారు. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ పర్యవేక్షణలో మారేడు చెట్టుకు, గోమాతకు విశేష పూజలు చేశారు. యర్రమిల్లి గురుచరణ్‌శర్మ బ్రహ్మత్వంలో అష్టాక్షరీ జపాలు, త్రిచపూజ, త్రిచఅర్ఘ్యం, సూర్యనమస్కారాలు నిర్వహించారు.

చిన్నారుల ఉజ్వల భవితకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పునాది: డీఈవో సలీంబాషా



అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణను ప్రారంభించి మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాది పడేది అంగన్వాడీ కేంద్రాల్లోనేనని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు కూడా విద్యా వ్యవస్థలో భాగమేనన్నారు. పూర్వ ప్రాథమిక విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ టీచర్లు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. కొంకాపల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు ఆరు రోజుల శిక్షణను ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం ఆధ్వర్యంలో మంగళవారం ఆయనప్రారంభించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.శాంతికుమారి, సీడీపీవో విజయశ్రీ, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి జ్యోతిప్రజ్వలన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో సలీంబాషా మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్ల సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు చిన్నారులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధనా పద్ధతులు వివరిస్తామని చెప్పారు. అంగన్వాడీ విద్యార్థులను అసెస్‌మెంట్ చేసే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బీఎస్ వెంకటేశ్వరరావు, రిసోర్సుపర్సన్లు కె.కిశోర్‌కుమార్, ఎన్.శ్రీనివాస్, జె.మహేష్‌బాబు, కేకేడీ అన్నపూర్ణేశ్వరి, కేవీఎల్డీ కుమారి, జి.గణేశ్వరి, కో-ఆర్డినేటర్ ఎస్కే రెహ్మాన్, సీఆర్‌ఎంటీలు అనూష, నాగమల్లేశ్వరరావు, గూటం నాగన్న, త్రినాథ్, ఎం.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

'వంతెన నిర్మాణ పనులు 40 శాతం పూర్తి'



పిల్లర్ లోపల మట్టి నమూనాలను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్

పి.గన్నవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): లంక గ్రామాల ప్రజల కోసం నిర్మిస్తున్న వంతెన పనుల్లో ఇప్పటివరకు రూ.30కోట్ల విలువైన 40 శాతం పనులు పూర్తయ్యాయని పంచాయతీరాజ్ ఎస్ఈ ఏవీ శ్రీనివాస్ తెలిపారు. గంటి పెదపూడిలో వంతెన 5వ పిల్లర్ వద్ద 37 మీటర్ల లోతులో ఉన్న మట్టి నమూనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులు, జరగాల్సిన పనులపై అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్ఈ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లర్ల పనులు జరుగుతున్నాయన్నారు. గడువులోపే లంక గ్రామాల ప్రజలకు వంతెన అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఎస్ఈ వెంట పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు, కాంట్రాక్టరు ఉన్నారు.

వచ్చే నెల 15న ఉమ్మడి జిల్లాల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలు

పి.గన్నవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ఎస్ఎస్ ఫిట్‌నెస్ జోన్ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 15న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలను పి.గన్నవరంలో నిర్వహించనున్నట్టు ఆర్గనైజర్ కత్తుల శ్రీనివాసు తెలిపారు. బ్రోచర్, గోడ పత్రికలను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఉమెన్, మెన్, మాస్టర్స్ విభాగాల్లో పది కేటగిరిల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్స్, చాంపియన్ ట్రోఫీలతో పాటు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంకిపాటి వెంకటేశ్వరరావు, తాటికాయల శ్రీను, దైవాల రాంబాబు, తోలేటి దొరబాబు, వాకపల్లి దొరబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మలికిపురంలో పట్టభద్రులను ఓట్లు అడుగుతున్న ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే వరప్రసాద్

'కూటమి అభ్యర్థి రాజశేఖరాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి'

మలికిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పట్టభద్రులను అభ్యర్థించారు. మంగళవారం వారు మలికిపురంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు ఇంటి వద్ద, శాలిపేటలో కాకి లక్ష్మణ్ ఇంటి వద్ద ఓటర్లను బ్యాలెట్ నమూనా చూపి ఓట్లు అడిగారు. సచివాలయ సిబ్బందిని, పలు చోట్ల గ్రాడ్యుయేట్లను కలిసి బ్యాలెట్ నమూనాలు అందజేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు ఇంటికి వద్ద ఎంపీ, ఎమ్మెల్యేలను మాజీ ఎంపీపీ గుండుబోగులగంగాభవానీ నూతన వస్త్రాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ప్రచారంలో చిటికెన రామ్మోహనరావు, గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, జంపన సత్యనారాయణరాజు, భూపతిరాజు సాయిబాబురాజు, కాకి లక్ష్మణ్, అనుచూరి పురుషోత్తం, గుబ్బల రవికిరణ్, అడబాల సాయిబాబు, మంగెన భూదేవి, అడబాల రమాదేవి, కాకి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు ఆధ్వర్యంలో ముమ్మిడివరంలోని తారా కళాశాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ముమ్మిడివరం జడ్పీ బాలుర, బాలికల హైస్కూలు, మోకా గణపతిరావు జూనియర్, డిగ్రీ కళాశాల, బాలాజీ కాన్వెంట్, రవీంద్ర, ఐమైండ్ స్కూలు, రాజుపాలెం, పల్లిపాలెం సచివాలయాల్లో ప్రచారం చేశారు. దొమ్మేటి రమణకుమార్, నిమ్మకాయల విస్సు, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, మెండి కమల, రెడ్డి శ్రీను, జగతా గోవిందు, గోదశి గణేష్, కాశి లాజర్, పాయసం చిన్ని, గొల్లపల్లి గోపి, కుడుపూడి మల్లీశ్వరి, గెడ్డం శ్రీరామ్, తొత్తరమూడి జ్యోతిబాబు, బడుగు సందీప్‌సాయి, శీలం వెంకటరమణ, బూరుగు కల్యాణ్, నీతిపూడి వంశీ, గెడ్డం శ్రీనివాసరావు, సరిపెల్ల నాగరాజు, కటికదల నాని తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి తరపున పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటిప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చెట్టి బాబు ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవిని కలుసుకుని ఓటు అభ్యర్థించారు.పట్టణంలోని విద్యా సంస్థలతో పాటు డివిజనల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి రాజశేఖర్‌కు ఓటు వేయాలని కోరారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, కూటమి నాయకులు కల్వకొలను తాతాజీ, పడాల నానాజీ, యేడిద శ్రీను, ఆశెట్టి ఆదిబాబు, అబ్బిరెడ్డి చంటి, శెట్టిబత్తుల దిన్నాబాబు, వెలిగట్ల రామలక్ష్మణరావు, పలివెల శ్రీనివాస్, నల్లా సుబ్బారావు, బోనం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా కూటమి నాయకులు ప్రచారం చేశారు. అల్లవరం, పరిసర ప్రాంతాల్లో జనసేన మండల ఉపాధ్యక్షుడు కంకిపాటి వీరబాబు, చిట్నీడి శ్రీనివాస్, మామిడిశెట్టి శ్రీరామ్, కంకిపాటి గోపి, బండిగుప్తావు వీరపండు, రాసూరి రాంబాబు, నార్గన శ్రీనివాస్, పచ్చిమాల ఏడుకొండలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అంబాజీపేట (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఆయన కూటమి నాయకులతో కలిసి కె.పెదపూడి, గంగలకుర్రు, మాచవరం గ్రామాల్లో ప్రచారం చేశారు. బీసీ సెల్ జిల్లా కార్యదర్శి అధికారపు బాబ్జీ, పెచ్చెట్టి హరిబాబు, యర్రంశెట్టి వీరభద్రం, మోకా శ్రీను, కాగితాపల్లి సుబ్బారావు, మట్టపర్తి రామారావు, మట్టపర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వంతుల వారీ విధానంలో సాగునీరు

అంబాజీపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముక్కామల లాకుల పరిధిలోని ఉన్న కాలువలకు బుధవారం రాత్రి 11 నుంచి గురువారం రాత్రి 11 గంటల వరకు వంతుల వారీగా సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ జేఈ నవీన్‌కుమార్ తెలిపారు. మోడేకుర్రు, నేదునూరు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, ఎస్.సావరం, బిళ్లకుర్రు, వక్కలంక గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూఎంపీడబ్ల్యూఏ అధ్యక్షుడిగా ప్రసాద్

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 18 (ఆద్రజ్యోతి): ఉప్పలగుప్తం మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గోడివారిపేట చర్చిలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీకేవీ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మావూరి కిరణ్, కార్యదర్శిగా డీఆర్ఎస్ శాస్త్రి, సంయుక్త కార్యదర్శిగా లంకే డేవీడ్, కోశాధికారిగా జనిపెల్ల ఇస్సాక్, గౌరవ అధ్యక్షులుగా మెండి దైవదాస్, తోకల శరత్‌బాబు ఎన్నికయ్యారు.

పోరాట యోధుడు బాబ్జీ మృతి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిరంతర పోరాట యోధుడు, సామాజిక ఉద్యమ కార్యకర్త పచ్చిమాల బాబ్జీ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనస్వగ్రామమైన వన్నెచింతలపూడి అంబేడ్కర్ నగర్ నుంచి మంగళవారం నిర్వహించిన అంతిమ యాత్రలో ప్రజా సంఘాల నాయకులు, అంబేడ్కరిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యానాం చేరుకున్న పుదుచ్చేరి మంత్రి

తల్లి మృతి సమాచారంతో తిరుగు ప్రయాణం

యానాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి మంత్రి ఏకే సాయి శర్వనన్‌కుమార్ రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి యానాం చేరుకున్నారు. ఆయనకు ప్రభుత్వ అతిథి గృహం వద్ద పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, యానాం పరిపాలనాధికారి మునిస్వామి, కమిషనరు ఖండవల్లి రామకృష్ణ, బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, గుత్తుల గోవింద జయరామరావు, కదా పవన్‌ప్రసాద్ స్వాగతం పలికారు. రాత్రి రెండు గంటల సమయంలో మంత్రి తల్లి అకస్మికంగా మృతి చెందారన్న సమాచారంతో మూడు గంటలకు రోడ్డు మార్గంలో విశాఖపట్నం వెళ్లి అక్కడి నుంచి విమానంలో పుదుచ్చేరి చేరుకున్నారు. దీంతో అధికారిక కార్యక్రమాలను యంత్రాంగం రద్దు చేసింది.

తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు: ఎమ్మెల్యే గొల్లపల్లి

యానాం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): యానాం శివారు దరియాలతిప్ప రైతులు సాగునీటి ఇబ్బందులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పరిపాలనాధికారి, ప్రజా పనుల శాఖ అధికారులతో సమీక్షించిన అనంతరం కనకాలపేటలోని పంపుహౌస్‌లో నీటిమట్టాన్ని పరిశీలించారు. ఏపీ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రైతులకు, ప్రజలకు తాగు, సాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే నిధులు, ఆది ద్రావిడ సంక్షేమ శాఖ నిధులపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. నిధులు విడుదల చేసినా కార్యాచరణ లేకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి లైసెన్సు రద్దు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటే తప్ప పనులు జరగవన్నారు. కమిషనరు ఖండవల్లి రామకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయ పరిశీలన

యానాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మెట్టకుర్రులోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడారు. వంటశాలను చూసి విద్యార్థులతో కలిసి ఆహార పదార్థాలను రుచి చూశారు. వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

మహా కుంభమేళా యాత్రకు ఏడో బస్సు ప్రారంభం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఆర్టీసీ అమలాపురం డిపో ఏర్పాటు చేసిన ఏడో బస్సును జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. డిపో మేనేజరు చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 21న మరో రెండు బస్సులను సిద్ధం చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం ఎస్.వరహాలబాబు 9959225576, 7382909620 నెంబర్లను సంప్రదించాలన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ గంగుమళ్ల రామలక్ష్మీదేవి, అసిస్టెంట్ మేనేజర్లు ప్రతిమాకుమారి, మాలింబాషా, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ వరహాలబాబు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ అమలాపురం డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై బుధవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మేనేజరు చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని, ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 9581932678 నెంబరుకు తెలియజేయాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

రాజోలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డీవీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.1.62 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,62,670 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సు: ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల ద్వారా యాత్రికులు వేలాదిగా వెళుతున్నారు. రావులపాలెం డిపో నుంచి ఆర్టీసీ సంస్థ ఒక్కొక్కరికి రూ.10,500 టిక్కెట్టుతో ప్రసిద్ధ ఆలయాలను దర్శించుకుంటూ ప్రయాగ్‌రాజ్ వెళ్లేలా బస్సులను ఏర్పాటు చేశారు. మంగళవారం రెండు ఆర్టీసీ బస్సుల ద్వారా వెళుతున్న భక్తులు వాడపల్లి చేరుకుని వెంకన్నను దర్శనం చేసుకుని యాత్రకు పయనమయ్యారు.

తిరుపతి సదస్సులో పాల్గొన్న వాడపల్లి ఉపకమిషనరు


అంతర్జాతీయ ఆలయ సదస్సులో రాష్ట్ర కమిషనరుతో వాడపల్లి ఉపకమిషనరు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆలయాల ప్రతినిధుల సదస్సును తిరుపతిలోని ఆశా కన్వెన్షన్‌లో మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్‌పో 2025లో భాగంగా ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో ఉత్సవంగా ప్రారంభించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ఆలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మహారాష్ట్ర, గోవా సీఎంలు వివిధ రాష్ట్రాల మంత్రులు పాల్గొన్నారు. దేశంలోని ప్రసిద్ధ ఆలయాల అధికారులు, ప్రతినిధులు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు వచ్చిన సదస్సుకు వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు మూడు రోజుల పాటు జరిగే సదస్సులో పాల్గొన్నారు. రాష్ట్ర దేవదాయ కమిషనరు రామచంద్రమోహన్‌తో కలిసి ప్రతినిధుల సదస్సులోని ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ నిర్వహించిన వర్క్‌షాపు ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెల్లూరు, కూర్మాపురంలో బ్రహ్మకుమారీల రథయాత్ర

రాయవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఉజ్జయిని నుంచి ప్రారంభమైన సోమనాథ్ జ్యోతిర్లింగ రథయాత్ర మంగళవారం మండలంలోని చెల్లూరు, కూర్మాపురం గ్రామాల్లో సాగింది. బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పునరుద్ధరించడానికి, పరమాత్ముని ద్వివ అవతరణ, కర్తవ్యాలను తెలియజేశాలనే ఉద్దేశంతో రథయాత్ర చేపట్టినట్లు తెలిపారు. తొలుత గ్రామంలో పర్యటించిన రథంలో సోమనాథ్ జ్యోతిర్లింగాన్ని భక్తులు దర్శించుకున్నారు. రథయాత్ర కరపత్రాలను వారు ప్రజలకు అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, బ్రహ్మకుమారీలు చంద్రలేఖ, భాగ్యలక్ష్మి, కుమారి, రామలక్ష్మి, లక్ష్మి, జ్యోతి, మణి, సుమారు 100 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.


చెల్లూరులో రథం వద్ద కరపత్రాలను అందిస్తున్న బ్రహ్మకుమారీలు

హోమియో వైద్యశాలలో డాక్టర్ నియామకంపై హర్షం

కె.గంగవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపల్లి హోమియో వైద్యశాలలో కొంత కాలంగా వైద్యుడు లేకపోవడంతో పరిసర గ్రామాల ప్రజలకు హోమియో సేవలు అందేవికావు. ఆసుపత్రికి వైద్యుడిని నియమించాలని ఎన్నోసార్లు ప్రజలు విజ్ఞప్తి చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు, కూటమి నాయకులు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాలతో ప్రభుత్వం డాక్టర్ మిధున్‌ను నియమించగా, మంగళవారం ఆయన విధుల్లో చేరారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రికి వైద్యుడిని నియమించడంతో పాటు, వైద్య సేవలు పునరుద్ధరించడంపై కూటమి ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


హోమియో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు మిధున్

గోవింద నామస్మరణతో మార్మోగిన చింతలూరు


చింతలూరులో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల దృశ్యం

ఆలమూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): చింతలూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజు కూడా ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు మంగళ ధ్వని సుప్రభాతసేవ, తోమాల సేవలతోపాటు పలు రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. జల క్రీడోత్సవం, అష్టలక్ష్మీ యాగాలకు వేద పండితులు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో పలువురు పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రముఖులతో ఉపన్యాసం, వాహనోత్సవం జరిగాయి.

స్వామివారి ఊరేగింపు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహన సేవకు ప్రత్యేకత ఉంటుంది. గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి ఆలయం నుంచి గ్రామంలోని వీధుల్లో మంగళవాయిద్యాలు, డోలు సన్నాయిలతో ఊరేగించారు. మహిళా భక్తులు పురందరదాసు, అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తూ చేసిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతులకు పగటిపూట 9 గంటల కరెంట్

• అటకెక్కిన గత ప్రభుత్వ హామీ • ఇప్పుడు కూటమి నిర్ణయంతో హర్షాతిరేకాలు


అంకంపాలెంలో విద్యుత్ మోటార్ ద్వారా పంట పొలాలకు వెళుతున్న సాగునీరు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులు రాత్రివేళల్లో పొలం వెళ్లే పనిలేకుండా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. రైతులకు పగటి పూటే ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తుండటంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డీఎస్ఎస్ స్కీమ్ ద్వారా రైతులకు నేరుగా త్రీఫేస్ కరెంట్ అందించేందుకు ప్రత్యేక లైన్లు వేసే పనులు చేపడుతున్నారు. ఈ పనులు కూడా పూర్తిదశకు చేరుకున్నాయి. రైతులు 9 గంటలపాటు అంతరాయం లేకుండా పంటపొలాలకు సమృద్ధిగా నీరు పెట్టుకునే అవకాశం కలుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో 9 గంటల విద్యుత్ సరఫరా అంటూ రైతులను దగా చేసింది. దీనికితోడు తరచూ విద్యుత్ అంతరాయంతో పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందేదికాదు. రైతులు నీరు లేక పంట పండించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. త్రీఫేస్ కరెంటు ఏ సమయంలో ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడేది. రైతులు రాత్రి-పగలు తేడా లేకుండా గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పంట పొలాల్లో నిద్రలేకుండా గడిపేవారు. రాత్రివేళల్లో పలువురు రైతులు విషసర్పాల బారినపడి ప్రమాదపు అంచులు వరకు వెళ్లిన సందర్భాలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సమస్యలపై దృష్టిసారించింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఎటువంటి హామీ ఇవ్వకపోయినా సీఎం చంద్రబాబు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎటువంటి అంతరాయం లేకుండా త్రీఫేస్ కరెంట్ అందిస్తోంది. దీంతో రైతులు తమ పంట పొలాలకు నీరు పెట్టుకుంటూ ఊరట చెందు తున్నారు. 2014-19 సమయంలో సీఎం చంద్రబాబు రైతులకు పెద్దపీట వేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు దాన్ని నిర్వీర్యం చేసింది. పంటలు సరిగ్గా పండక రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకున్న కూటమి ప్రభుత్వం పగలు 9 గంటలు విద్యుత్ సరఫరా అందిస్తూ చర్యలు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

రావులపాలెం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు.రమేష్‌బాబు తెలిపారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టణవాసుల ఇంటి వద్దకే 30 రకాల సేవలు

• మెప్మా ఆధ్వర్యంలో సులభతరం కానున్న పలు సేవలు • మెప్మా అధికారి ప్రియంవద వెల్లడి

మండపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) పట్టణంలో ఉండే వారికి చేతి పనులు చేసేవారు దొరకటం కష్టంగా మారింది. ఇంట్లోని వాషింగ్ మిషన్ పాడైంది? ఏసీ పనిచేయటం లేదు. కరెంట్ పనిచేసే వాళ్లు దొరకటం లేదు. వాళ్లు ఎక్కడ ఉంటారో కూడా పట్టణవాసులకు తెలియని పరిస్థితి. ఒకవేళ వాళ్లు దొరికినా ఎంత తీసుకుంటారో తెలియదు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ముందుకు వచ్చింది. ఎలక్ట్రికల్, కార్పెంటరీ, ప్లంబింగ్, పెయింటింగ్, ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ తదితర పలు రకాల సేవలు అందించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ తర్వాత 30 రకాల సేవలను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు పనివాళ్ల కోసం తిరిగే పట్టణ వాసులకు ఇక నుంచి 30 సేవలు లభ్యం కానున్నాయి. మెప్మా ఆధ్వర్యంలో సర్వీసు ప్రొవైడర్ సర్వే నిర్వహిస్తున్నారు.

పట్టించుకోని గత ప్రభుత్వం

పట్టణ ప్రజలకు అవసరమైన వాటి సేవలు ఇంటి వద్దే అందించాలన్న ఉద్దేశంతో కార్మికులకు ఉపాధి కల్పించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో సీటీ లైవ్లీహుడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రజల ఇంటి వద్దకే వివిధ సేవలను అందించాలన్న లక్ష్యంతో సర్వీస్ ప్రొవైడర్ల వ్యవస్థను తీసుకురావాలని నిర్ణయించింది. ముందుకు వచ్చిన ప్రొవైడర్లకు నెలకు కనీసం రూ.20వేల నుంచి రూ.30వేల వరకు వచ్చేలా ప్రణాళిక రూపకల్పన చేసింది.

నెలాఖరులోపు దరఖాస్తుల స్వీకరణ

మెప్మా ఆధ్వర్యంలో పలు విభాగాల్లో పని చేసే నిపుణులను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఎవరైనా పలు వృత్తుల్లో నైపుణ్యం కలిగిన వారుంటే మెప్మా విభాగాలను సంప్రదించి వివరాలు అందించి నమోదు చేసుకున్నారు. ఆయా విభాగాల వారీగా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి త్వరలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీరి ఎంపిక, శిక్షణ తదితర పనులు మార్చి 8నాటికి పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పురపాలక సంఘాల పరిధిలో పలు విభాగాల్లోని టెక్నీషియన్లను గుర్తించే బాధ్యతను మెప్మా విభాగానికి అప్పగించారు. వీరికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వనున్నారు. అనంతరం వారి వివరాలను హోమ్ ట్రయాంగిల్ యాప్‌లో నమోదు చేస్తారు. సర్వీస్ ప్రొవైడర్లుగా నమోదు చేసుకున్న వారు మొదటి మూడు నెలలపాటు నెలకు రూ.100 వంతున నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. మూడు నెలలు సదరు రంగంలో నిలదొక్కుకున్న తర్వాత నాలుగో నెల నుంచి సదరు యాప్ నిర్వాహకు లకు ప్రతినెలా రూ.1500 వంతున చెల్లించాల్సి ఉంటుంది.

యాప్ రూపకల్పన

ఇందుకోసం కొత్తగా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అదే విధంగా ట్రయాంగిల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. నైపుణ్యమున్న మెకానిక్‌ల(సర్వీస్ ప్రొవైడర్లు)ను గుర్తించి వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 416 మందిని గుర్తించారు. అమలాపురం మున్సిపాల్టీలో 164, మండపేటలో 110, ముమ్మిడివరంలో 52, రామచంద్రపురంలో 90 మందిని గుర్తించినట్టు జిల్లా మెప్మా అధికారిణి బి.ప్రియంవద చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ప్రొవైడర్ సర్వే పూర్తయిందని ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు.

ప్రొవైడర్ల ఫోన్ నెంబరు, చిరునామాతో సహ యాప్‌లో పొందుపరుస్తారు. ఆయా వివరాలు అందరికీ తెలిసేలా సెల్లార్ పాయింట్ నంబరు ఏర్పాటు చేస్తారు. మెప్మా ద్వారా ప్రభుత్వమే ఆయా సేవలకు ధరలు నిర్ణయిస్తుంది. ఈ సేవలందించే సర్వీసు ప్రొవైడర్లకు మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వటంతోపాటు వారికి ప్రతి నెలా రూ.20 నుంచి 30వేల వరకు ఆదాయం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక నుంచి పట్టణవాసులకు మెప్మా ద్వారా సర్వీస్ ప్రొవైడర్‌లు సేవలు అందనున్నాయి.


రామచంద్రపురం బార్ అసోసియేషన్ భవనంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి సుభాష్


కొత్తపేటలో జరిగిన ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు, ఎన్నికల పరిశీలకుడు గణేష్‌కుమార్

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

పట్టభద్రులకు మంత్రి సుభాష్ పిలుపు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యావంతులు, న్యాయవాదులు, పట్టభద్రులు కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతు పలికి గెలిపించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. మంగళవారం రామచంద్రపురంలోని కృత్తివెంటి క్రీడా ప్రాంగణం, బార్ అసోసియేషన్, పలు ప్రైవేటు పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం జరిపారు. బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన సమావేశంలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ని గెలిపించాలని న్యాయవాదులను ఆయన కోరారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన వెంకటరమణ, ఏజీపీ లకాని పద్మకమలకుమారి, సీనియర్ న్యాయవాదులు ముషిని సర్వారాయుడు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. భాష్యం పాఠశాలలో ఉపాధ్యాయులను, కృత్తివెంటి క్రీడా ప్రాంగణంలో వాకర్స్, ఉద్యోగులు, క్రీడాకారులను ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు పలు వార్డుల్లో గ్యాడ్యుయేట్ ఓటర్లను కలసి ఎన్నికల ప్రచారం చేశారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం కొత్తపేట, పలివెల, వాడపాలెం గ్రామాల్లో జరిగిన ఎమ్మెల్సీ ప్రచారంలో ఆయన పాల్గొని రాజశేఖర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎన్నికల పరిశీలకుడు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజే గణేష్‌కుమార్, బీజేపీ నాయకులు పాలూరి సత్యానందం, వాసిరెడ్డి రాంబాబు, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ ద్వారపూడిలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి నేతృత్వంలో కూటమి నేతలు గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి రాజశేఖరంను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమి నేతలు చిక్కాలరాజు, సలాది బాలసుబ్రహ్మణ్యం, తామళ్ల రాజు, బి.సత్తిబాబు, చింతా శివబాల తదితరులు పాల్గొన్నారు.


ద్వారపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి నేతలు


కె.గంగవరంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం


రాయవరంలో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో మాట్లాడుతున్న ఏఎంవో రాంబాబు


ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు

అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ

కె.గంగవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని ఎంఈవో 1 ఏ.నాగరాజు అన్నారు. మంగళవారం కె.గంగవరం ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో 2 చోడిశెట్టి ఆంజనేయులు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని రామచంద్రపురం ఐసీడీసీ ప్రాజెక్టు అధికారిణి వరాహలక్ష్మి పర్యవేక్షించగా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ జరిపారు. కార్యక్రమంలో ఏఎంవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మరింత మెరుగైన బోధన చేసేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపకరిస్తుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన డీఆర్పీలు అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, అంగన్‌వాడీ మాచవరం, రాయవరం సూపర్‌వైజర్లు సునీత, బి.విష్ణుకుమారి, డీఆర్పీలు ఆర్.భాస్కరరావు, ఎం.రాజు, ఎం.విజయకుమార్, కేవీ తాతాజీ, మండలంలోని 12 గ్రామాల నుంచి ఎంపిక చేసిన 63 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు పాల్గొని మాట్లాడారు. ఆలమూరు మండల విద్యాశాఖ అధికారులు భమిడిపాటి అప్పాజీ, ఎన్వీ సుబ్బరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, అరుంధతి, ఉపాధ్యాయులు ఎంవీవీ.రామరాజు, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతిపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆరు రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు. సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వచ్చేనెల 15న ఉమ్మడి జిల్లాల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలు

పి.గన్నవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ఎస్ఎస్ ఫిట్‌నెస్ జోన్ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 15న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలను పి.గన్నవరంలో నిర్వహించనున్నట్టు ఆర్గనైజర్ కత్తుల శ్రీనివాసు తెలిపారు. బ్రోచర్, గోడ పత్రికలను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఉమెన్, మెన్, మాస్టర్స్ విభాగాల్లో పది కేటగిరిల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్స్, చాంపియన్ ట్రోఫీలతో పాటు నగదు అందిస్తారన్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంకిపాటి వెంకటేశ్వరరావు, తాటికాయల శ్రీను, దైవాల రాంబాబు క్రీడాకారులు పాల్గొన్నారు.

పోస్టల్‌శాఖ ప్రైవేటీకరణను నిలిపివేయాలి

మండపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) తపాలా శాఖను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలని పోస్టల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. 2023 పోస్టల్ చట్టాన్ని రద్దు చేయాలని, గ్రామీణ తపాల ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ మంగళవారం మండపేట పోస్టాఫీస్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తపాలా శాఖను మూడు ముక్కలు చేసే విధానం మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు కొండపల్లి సూర్యనారాయణ, జి.వెంకట్రావు, ఎండీఎం షరీఫ్, పిల్లా నాగేశ్వరరావు, పి.ద్య, పాల్గొన్నారు.


ప్రైవేటీకరణను నిలిపివేయాలని నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ద్రాక్షారామ, వెంకటాయపాలెం ఫీడర్ మరమ్మతుల కారణంగా నేటి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. కోటిపల్లి రోడ్డు, యానం సెంటర్, బందుల గూడెం, అన్నాయిపేట, కుందాలమ్మ చెరువు, దాసరిపాడు, వెలంపాలెం, రంగనాయకుల పేట, చిన్నంపేట, వెంకటాయపాలెం, వల్లు వారి పేటలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం జగన్నాయకుల పాలెం గ్రామానికి చెందిన ముద్దాల అప్పారావు అదృశ్యంపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది నవంబరు 7 నుంచి ముద్దాల అప్పారావు కనిపించకుండా పోయాడన్నారు. అదే విధంగా పలు సార్లు కనిపించకుండా వెళ్లిపోయినా వారం, పది రోజుల్లో తిరిగి వచ్చేవాడన్నారు. ఈసారి నెలలు గడుస్తున్నా తిరిగి రాలేదని అతని భార్య ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. ద్రాక్షారామ ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామకు చెందిన చెరుకూరి నాగమనోజ్ఞ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసులు వరకట్న వేధింపులపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన శివరాంతో 2017లో నాగమనోజ్ఞకు వివాహం జరిగిందన్నారు. పెళ్లి సమయంలో లక్షల రూపాయల కట్నం, బంగారం, వెండి వస్తువులు ఇచ్చారన్నారు. ఇద్దరు పిల్లలు పుట్టే వరకు వారి కాపురం సజావుగా సాగిందన్నారు. కొంత కాలంగా అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్తమామలు, ఆడపడుచు శారీరక, మానసికంగా వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. మనోజ్ఞ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంగా ఉన్న చెట్టును తొలగిస్తాం

కె.గంగవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట యూపీ పాఠశాల వద్ద ప్రమాదంగా ఉన్న చెట్టును తొలగిస్తామని ఎంఈవో1 ఏ.నాగరాజు అన్నారు. ఈ చెట్టు వల్ల ప్రమాదం పొంచి ఉందని ఇటీవల అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో డీఈవో ఆదేశాలతో చెట్టు తొలగించే చర్యలు చేపట్టినట్టు ఎంఈవో నాగరాజు చెప్పారు. మంగళవారం పాఠశాల గోడ వద్ద ఉన్న చెట్టును వారు నాయకులతో కలిసి పరిశీలించారు. చెట్టు తొలగింపునకు గ్రామ పెద్దలతో కలిసి కమిటీ వేశామని, త్వరలో దాన్ని తొలగిస్తామన్నారు.

ఉద్యోగుల ఐక్యతతో సమస్యలు పరిష్కారం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఐక్యతతో సమస్యలు పరిష్కారం అవుతాయని గెజిటెడ్ అండ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదవరపు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం రామచంద్రపురంలో జరిగిన పశుసంవర్థక శాఖ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులు సభ్యత్వ రుసుముగా రూ.15వేలు అందించారు. ఈ సమావేశానికి పశుసంవర్ధకశాఖ ఏడీ రామకృష్ణ అధ్యక్షత వహించగా కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పశు సంవర్ధకశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల సూర్యారావు, కార్యదర్శి కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నైనాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి మాదవరపు కాశీ విశ్వేశ్వరరావు, గొల్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆబోతుల కుమ్ములాటలో వ్యక్తికి గాయాలు

కాట్రేనికోన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో మంగళవారం సాయంత్రం రెండు ఆబోతుల మధ్య పోట్లాట జరిగింది. అవి అటుగా వెళ్తున్న వాహనచోదకుడిని కిందపడేసి కుమ్మేశాయి. వాహనం నుజ్జునుజ్జు కాగా ఆ వ్యక్తి అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు.


పేరవరం గోదావరి లంకలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లపుఊట ధ్వంసం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరం గోదావరి వద్ద మంగళవారం సారా తయారు చేస్తున్న స్థావరంపై ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో దాడులు జరిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. మెర్లపాలానికి చెందిన సి.తాతారావును 2 లీటర్ల సారాతో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎక్సైజ్ ఎస్‌ఐ కె.అన్నవరం తెలిపారు.